క్లుప్తంగా

ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాలికలకు కరాటేలో శిక్షణ



నరసరావుపేట: స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సీ బాలికల స్కూలులో సోమవారం ఉజ్వల భారత మహిళా శక్తి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కరాటే శిక్షణా తరగతులను డీఎస్పీ కేవీ మహేష్ ప్రారంభించారు. అనంతరం సీనియర్ కోచ్ పి.రాంబాబు, జి.సాయిరాం, ఎం.చైతన్య దీప్తి విద్యార్థినులకు కరాటేలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపల్ ఎం.కుమారి, పీఈటీ అశోక్‌కుమార్, ఉజ్వల భారత్ మహిళా శక్తి సేవా సంఘ అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు

రొంపిచర్ల: మండలంలో మిచాంగ్ తుపానుకు కురిసిన వర్షాలకు మండలంలో 1300 హెక్టార్లలో మంచి శనగ పైరుకు నష్టం జరిగిందని నరసరావుపేట ఏడీఏ పి. మస్తానమ్మ తెలిపారు. ఈ మేరకు స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం ఆమె మాట్లాడుతూ శనగపంట నష్టపోయిన రైతులందరికీ 80 శాతం రాయితీపై శనగ విత్తనాలను అందజేస్తామన్నారు. మండలంలోని రైతుభరోసా కేంద్రాలలో 1300 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. రూ 8,100ల విలువ గల శనగ విత్తనాలకు రైతు తమ వాటాగా రూ.1,620లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ అవకాశాన్ని శనగ పంట నష్టపోయిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు తీర్చండి

నరసరావుపేట: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ కాంట్రాక్టర్ వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు యునైటెడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కార్యాలయంలో కొద్దిసేపు ఆందోళన చేసిన అనంతరం ఎస్ఈ వి.శ్రీనివాసరావుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణా మాదిరిగా తమకు డైరెక్ట్‌గా వేతనాలు ఇవ్వాలని, నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత షిఫ్ట్ ఆపరేటర్లకు ఇస్తున్న జీతం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలీడేస్ ఇవ్వాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని, పదేళ్ల ఇంక్రిమెంట్, నాలుగురోజుల జీతం ఇవ్వాలని, వాచ్‌మెన్‌లను సబ్‌స్టేషన్లకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ ఆంజనేయులునాయక్, జె.రాజేష్, ఎం.సుబ్బారెడ్డి, పి.బాజాజీనాయక్, సీహెచ్.రాజేష్, ఏ.వెంకటరావు, ఎం.శ్రీకాంత్, ఎం.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరుని ఆలయానికి భూమిపూజ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామస్తులకు శుభకార్యాల సమయంలో అవసరమైన కళ్యాణ వెంకటేశ్వరస్వామి గుడి సమస్యకు మోక్షం లభించింది. గ్రామం నుంచి సంగం గోపాలపురం మార్గంలోని పురాతన కాలం నాటి చలివేంద్ర చెరువు ప్రాంతంలో వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు గ్రామపెద్దల ఆధ్వర్యంలో గుడి పనులకు భూమి పూజలు నిర్వహించారు.

గణపవరంలో...



నాదెండ్ల: గణపవరంలోని చవిటిపాలెంలో సోమవారం శ్రీ అభయాంజేయస్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. మాచవరానికి చెందిన సిద్ధాంతి పోతులూరి శివరామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఉదయం భూమిపూజ నిర్వహించారు. స్థానికులు నవధాన్యాలు వేసి పూజలు నిర్వహించారు. ఆలయం ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని చిలకలూరిపేటకు చెందిన షేక్ హసన్‌వలి రూ.10 లక్షల విలువైన ఆరు సెంట్ల స్థలాన్ని దానం చేశారు. త్వరలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో అభయాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం బుచ్చయపాలెం గ్రామంలో వైభవంగా పోలేరమ్మ అమ్మవారు, మహాలక్ష్మి, పోతురాజు దేవతల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధుప్రసాద్ యోగేశ్వర గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతిష్టా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఇస్సప్పాలెంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.9 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: ఆలయ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నూతన పాలకమండలి సభ్యుల అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. ఎంతో మహిమ గల అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లావ్యాప్తంగా భక్తులు తరలివస్తుంటారని, శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మాణానికి పూనుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, కమిటీ సభ్యులను అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ దాదాపు రూ.9 కోట్లతో ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. మొదటి దశలో రూ.5 కోట్లతో ప్రధాన ఆలయాన్ని రాతితో నిర్మిస్తామని తెలిపారు. రెండవ దశలో రూ.4 కోట్లతో బహుమండపాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు. ఇప్పటికే అనేక ఆలయాలు నిర్మిస్తున్న పట్టణానికి చెందిన శిల్పి రాజుకు ఆలయ నిర్మాణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో దాదాపు రెండువేల ఆలయాలను పునర్నిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వ సహకారంతో తొమ్మిది ఆలయాల నిర్మాణాలను చేపట్టినట్టు వివరించారు. సంతగుడిపాడులో టీటీడీ కల్యాణమండపాన్ని రూ.2.2 కోట్లతో నిర్మిస్తున్నామని, రెండు నెలల్లో దానిని ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కోటప్పకొండ ఆలయంలో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. దీంతో పాటు కోటప్పకొండకు వెళ్లే రోడ్ల విస్తరణకు రూ.21 కోట్లతో పూర్తిచేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనించి ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇస్సప్పాలెం గ్రామానికి చెందిన బండ్లమూరి నరసింహారావు రూ.5 లక్షలు, ఇంజినీర్ కమలాకరరెడ్డి రూ.లక్ష, నంద్యాల శివదామోదర్‌రెడ్డి రూ.లక్షను ఆలయ పునర్నిర్మాణానికి అందజేశారు. ఆలయ చైర్మన్ కొత్త సాంబశివరావు (వీఎస్‌పీ), నూతన పాలక మండలి సభ్యులు కాకుమాను బదరీనారాయణ, బూసా సుబ్రహ్మణ్యేశ్వరరావు, నంద్యాల మాధవిదేవి, ఆలపాటి ప్రసాదరావు, దరువూరి రజని, అట్లూరి శ్రీనివాసరావు, అల్లంశెట్టి అలివేలమ్మ, మేడా అలివేలు, నండూరి కాశీకృష్ణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.రంగారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఊరా భాస్కరరావు, ఆలయ ఈఓ టి. సుధాకర రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే వైఎస్సార్ సీపీ బలోపేతం

నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్‌నాయుడు



కొండవీడులో పర్యటిస్తున్న రాజేష్‌నాయుడు

యడ్లపాడు: పల్లెల్లో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. యడ్లపాడు మండలంలోని కొత్తపాలెం, కొండవీడు గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయుడిని ఘనంగా స్వాగతించి సత్కరించారు. కొండవీడులోని సెవెన్త్ డే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అనంతరం నాయకులతో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజలతో స్థానిక సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామపెద్దలు షేక్ జాకీర్ హుస్సేన్, యండ్రపల్లి వెంకట్రావు, వీరయ్య, కె.సోమయ్య, బొప్పూడి రోశయ్య, చిన్నోడు, ఎన్.రామకృష్ణ, కె.అంకారావు, మానం సాంబయ్య, పి.గురవయ్య, వెంకటేశ్వర్లు, పందుల బుల్లెబ్బాయి, బేరింగ్ మౌలాలి, గుంజి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

తూబాడులో సెమీక్రిస్మస్ వేడుకలు



కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పాల్గొన్న వైసీపీ ఇన్‌చార్జి మల్లెల రాజేష్‌నాయుడు



తూబాడులో సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

నాదెండ్ల: మానవాళికి శాంతిని ప్రసాదించేందుకు ఏసుప్రభు భూమి మీదకు వచ్చారని, ప్రజలు సోదరభావం, ప్రేమను కలిగి సమాజాభివృద్ధిని సాధించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. తూబాడు గ్రామంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ తలతోటి రాణి, రత్తయ్య దంపతులు నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కులమతాలకు అతీతంగా క్రిస్మస్‌ను అతిపెద్దపండుగలా భారతీయులు నిర్వహించుకుంటున్నారన్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

క్రీస్తు చూపిన బాటలో మన మంతా నడవాలని, సర్వమానవాళి సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, మల్లాది శివన్నారాయణ, పి.వెంగలరాయుడు, గద్దె కోటయ్య, ఉడతా వెంకటేశ్వరరావు, బత్తుల సీతారామిరెడ్డి, పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, అల్లడి రవి కుమార్, బ్రహ్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి ఆవరణలో..

నరసరావుపేట: స్థానిక క్రిస్టియన్‌పాలెం సెయింట్ పాల్ లూథరన్ చర్చి ఆవరణలో ఆదివారం రాత్రి యూత్ కమిటీ నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కటింగ్ నిర్వహించి, కొవ్వొత్తులు వెలిగించి నియోజకవర్గ ప్రజలకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ప్రభాకర్ పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, జిల్లా ఎస్సీ సెల్ మానిటర్ మెంబరు మల్లెల అశోక్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గుజ్జర్లపూడి ఆకాష్, మాజీ కౌన్సిలర్ గేరా ధర్మారావు, మాజీ సర్పంచు వంపుగుడి జాన్, యూత్ కమిటీ సభ్యులు అన్నవరపు మనోహర్ (పింటూ), టోనీ, రాజు, ప్రశాంత్, తలారి నాని, చిన్ని, కళ్యాణ్, యూత్ ఫ్రెండ్ సర్కిల్స్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



వాక్యాన్ని బోధిస్తున్న దైవసేవకులు మ్యాథ్యూస్

క్రీస్తు జననం, జీవితం మానవాళికి ఆదర్శం

యడ్లపాడు: ఏసుక్రీస్తు జననం, జీవితం మానవాళికి మార్గదర్శకమని గుంటూరుకు చెందిన దైవసేవకులు బ్రదర్ మ్యాథ్యూస్ సందేశం అందించారు. మండలంలోని ఉన్నవ గ్రామంలోని షాలేము ప్రార్థన మందిరంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలకు జరిగాయి. యడ్లపాడు మండలం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ముందుగా పాస్టర్ మ్యాథ్యూస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు క్రైస్తవ గీతాలను ఆలపించారు. దైవసేవలకు బైబిల్ వాక్యాలను బోధించారు. అలాగే సంఘకాపరులకు ఉండాల్సిన లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు ప్రత్తిపాటి ఎలీషా, కార్యదర్శి కొమ్ము ఇమ్మానీయేలు, ఉపాధ్యక్షులు యోహాను, కోశాధికారి అల్లడి కరుణానిధితో పాటు అన్ని గ్రామాల్లోని పాస్టర్లు, మాజీ జెడ్పీటీసీ కామినేని సాయిబాబు పాల్గొన్నారు.

వాడవాడలా సుబ్రహ్మణ్య షష్టి



ప్రత్యేక అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



గణపవరం శివనాగేంద్రస్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వినుకొండలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, విశేషాలంకరణ, పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు రామ్మోహనాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నాదెండ్ల: గణపవరం – నాదెండ్ల డొంక రోడ్డులో గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న శివనాగేంద్ర స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే పుట్టలో వార్లు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పృథ్వీ పూజ, అష్టోత్తర శతనామాలు, గోత్రనామ పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహాప్రసాదాన్ని నివేదించి వితరణ చేశారు. రాత్రి గణపవరం శివనాగేంద్రస్వామి భజన సమాజం వారిచే భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో 5, 7 వారాలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇతర ప్రాంతాల నుంచి కూడా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోండ్రు సాంబశివరావు, మాటూరి సుధాకరరావు, సింగు సత్యనారాయణ, మధుసూదనరావు, పూర్ణచంద్రరావు, సిద్ధు హనుమంతరావు తదితరులు ఉన్నారు.

విప్పర్లలో...

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో గల గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యేశ్వర షష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి వారికి పంచామృత సహిత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు



నరసరావుపేట: ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ నిర్వహించిన లక్కీడ్రాలో రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెంకు చెందిన ఇద్దరు మహిళలు కె.హారిక, కె.కోమలి గెల్చుకున్నారు. డిసెంబరు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు నరసరావుపేట డిపో నుంచి ముప్పాళ్ల, ఈపూరు, ఊడిజర్ల రూట్ బస్సుల్లో ప్రయాణించిన వారికి లక్కీడ్రా ఏర్పాటు చేశారు. ఈ డ్రాను గత శనివారం నిర్వహించి విజేతలకు సోమవారం కార్యాలయంలో డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సమక్షంలో చంద్రాషాపింగ్ మాల్ ప్రతినిధులు రాము దంపతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపుల ద్వారా పన్ను వసూళ్లు నిర్వహించాలి



బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయాల కార్యదర్శుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ మండలంలో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీలు, సచివాలయాల పరిధిల పరిధిలో ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించి డిజిటల్ చెల్లింపులు జరుపుటకు క్యూఆర్ కోడ్ మిషన్స్ ఉపయోగించాలన్నారు. క్యూఆర్ కోడ్ మిషన్స్ ద్వారా చెల్లింపులు జరిగేలా కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అభ్యర్థుల నమోదు ముగిసిందని, డిసెంబరు 26 నుంచి క్రీడాపోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం డిజిటల్ చెల్లింపుల నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులకు క్యూ ఆర్ కోడ్ మిషన్స్ అందజేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాల లబ్ధి పొందాలి

ఎంపీపీ తలతోటి రాణి



గ్యాస్ కనెక్షన్ అందిస్తున్న అధికారులు, నాయకులు

నాదెండ్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండలంలోని తూబాడు, బుక్కాపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు గోళ్లమూడి కాశయ్య, అల్లం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. పథకాలను అర్హులైన లబ్దిదారుల దరి చేర్చేందుకు స్థానిక అధికారులు కృషి చేయాలన్నారు. పొలాలకు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో యంత్రాన్ని అందిస్తున్నదన్నారు. ఉదయం 10 గంటలకు తూబాడులో, మధ్యాహ్నం 2.30 గంటలకు బుక్కాపురం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశ్వేత, మండల వెటర్నరీ వైద్యాధికారి ఏడుకొండలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఏపీఎం సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు జంగు జరీనా, వెంకటరావు, ప్రశాంతి, బిజెపి నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అల్లడి రవికుమార్ పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్



ప్రథమ బహుమతి గెల్చుకున్న జితేంద్ర, గోపీలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట రూరల్: డీఎస్ఏ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కావూరి బుచ్చిబాబు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. పోటీలలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 68 జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీలు హోరాహోరీగా జరిగాయి. పురుషుల ఓపెన్ విభాగంలో జితేంద్ర, గోపీ (గుంటూరు)లు ప్రథమస్థానం, ఖాదర్‌మస్తాన్, హర్షవర్ధన్ (చిలకలూరిపేట) ద్వితీయ స్థానం, ముని, జితేంద్ర (రేపల్లే) తృతీయస్థానం, ప్రసాద్, అనిల్ (నరసరావుపేట) నాల్గవస్థానం సాధించారు. 45 సంవత్సరాల విభాగంలో మురళీ, భాష (గుంటూరు) ప్రథమ స్థానం, సుబ్బు, శేషారెడ్డి(చిలకలూరిపేట) ద్వితీయ స్థానం, పి.శివకోటిరెడ్డి, డాక్టర్ పి.సురేష్‌రెడ్డి(నరసరావుపేట) తృతీయస్థానం, రషీద్, కెఎస్ రావు (గుంటూరు) నాల్గవస్థానం సాధించారు. విజేతలకు మెడల్స్‌తో పాటు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. పోటీలను డాక్టర్ శరత్ చందు, సుబ్బయ్య, పరమేష్, భాష, విక్రమ్‌సింగ్ పర్యవేక్షించారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆర్‌కె రాము, బ్రాటన్ జాకబ్, ఎస్ఎస్ మెటల్స్ రాంబాబు, పద్మాలయ వేణు, ఎల్‌జి బుజ్జి, పెనుగొండ ప్రతాప్, విజయరావులు పాల్గొన్నారు.

కుందురువారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 87 మందికి వైద్యసేవలందించారు. 64 మందికి సాధారణ వైద్య పరీక్షలు, ఏడుగురికి బీపీ పరీక్షలు, 8 మందికి షుగర్ పరీక్షలు, గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లు అందించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బి.అంజలి, డీఈఓ కె.రవితేజ పాల్గొన్నారు.

జెడ్పీ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించండి

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల జిల్లా పరిషత్ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించాలని 11వ వార్డు కౌన్సిలర్ జి.సతీష్‌కుమార్ కోరారు. సోమవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినాను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలో సర్వే నెంబర్.12లో జిల్లా పరిషత్‌కు చెందిన రెండు ఎకరాల స్థలం ఉందని, దానిలో కొంత భాగంలో పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్మించి ప్రారంభోత్సవం చేయలేదన్నారు. మిగిలిన స్థలం ఆక్రమణలకు గురవుతోందని అలా కాకుండా వాణిజ్య సముదాయం నిర్మించి పేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. గెస్ట్ హౌస్‌ను ప్రభుత్వ కార్యాలయాల అవసరాలకు వినియోగించేలా చూడాలని కోరారు.

కంది పంటలో పొలంబడి



వేపగింజల కషాయం తయారీ విధానాన్ని వివరిస్తున్న శిక్షకుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని ఏనుగుపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న కంది పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు టి.సైదయ్య హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉండటం వలన మొక్కలకు ఎక్కువ పోషకాలు లభించాలని, ఈ దశలో పంటపై కోడిగుడ్డు, నిమ్మరస ద్రావణం లేదా పంచగవ్య లేదా చేపబెల ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. దీని వలన కాయ నాణ్యత పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ కషాయాలకు కేవలం రూ.100లు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. అనంతరం రైతులకు వేప గింజల కషాయం తయారు చేసుకోవడంపై డెమో చేయడం జరిగింది. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జి శివలక్ష్మి, వేణుగోపాల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో ఆరోగ్య భద్రత

దాచేపల్లి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రతి మనిషి భద్రతకు భరోసాగా నిలుస్తుందని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింతగా బలోపేతం చేసి పేదల ఆరోగ్యం కాపాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఏపీఎం నాయక్, సర్పంచ్ కూసం నాగిరెడ్డి పాల్గొన్నారు.